అమ్మ కడుపు చల్లగా..

- గర్భిణులు, పుట్టిన బిడ్డలకు అండగా సర్పంచ్
- రెండేళ్లుగా గర్భిణులకు సీమంతం
- గ్రామంలో పుట్టిన ప్రతీ ఆడపిల్ల పేరిట రూ.5,116 డిపాజిట్
- పేద కుటుంబాలకు ఉచిత దహన సంస్కారాలు
- ఆదర్శంగా నిలుస్తున్న రావుల రమేశ్

సండే స్పెషల్


గర్భిణులకు సీమంతం చేస్తున్న సర్పంచ్ రమేశ్

తిమ్మాపూర్: పెళ్లయిన ప్రతీ స్త్రీ మాతృత్వం కోసం పరితపిస్తుంది. పూజలు, నోములు చేస్తూ గుళ్లు, గోపురాలు తిరుగుతుంది. గర్భం ప్రతీ మహిళకు దేవుడిచ్చిన వరం. ఆ మాతృత్వం, అమ్మతనంలోని మాధుర్యాన్ని ప్రతీ స్త్రీ ఆస్వాదించాలని చేయూత నందిస్తున్నారు నుస్తులాపూర్ సర్పంచ్ రావుల రమేశ్. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాది నుంచే అనేక రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. సొంత నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు, మహిళా, కుల సంఘాల భవనాలు నిర్మించారు.

సామూహిక సీమంతాలు

గర్భిణులకు తనవంతు సాయంగా సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును తానే భరిస్తున్నారు. చీరె, సారెతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. శనివారం సర్పంచ్ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 21 మంది గర్భిణులకు సీమంతం చేశారు. పూలు, పండ్లు, చీర పెట్టి ఆశీర్వదించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీడీఎస్ సిబ్బంది వివరించారు. పుట్టబోయే శిశువు మంచి ఆరోగ్యంగా ఉండేలా పోషకాహారం అందించాలని సూచించారు. సిజేరియన్ కాకుండా సహజ ప్రసవానికే ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని అన్నారు. సీడీపీవో సబిత, ఏసీడీపీవో అరవింద, సూపర్వైజర్ శ్రీలత, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు వంగాల పద్మ, బండమీది స్వరూప, గట్టయ్యయాదవ్, వంగాల రేఖ, సముద్రాల రాజు, రోడ్డ లావణ్య, గట్టు బాలవ్వ, కొండయ్యయాదవ్, దొంత రమేశ్, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఐసీడీఎస్ అధికారులు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

రమేశ్ అన్న కానుక..

నుస్తులాపూర్‌లో పుట్టిన ప్రతీ ఆడపిల్లకు రమేశ్ అన్న కానుక పేరుతో రూ.5,116 డిపాజిట్ చేస్తున్నారు. ఈ పథకాన్ని కూడా సొంతంగా అమలు చేస్తున్నారు. 21 మందికి సీమంతం అనంతరం ప్రస్తుతం గర్భిణుల్లో ఎవరికి ఆడపిల్ల పుట్టినా రూ.5,116 అందిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల పుట్టిన 11 మంది ఆడపిల్లల తల్లులకు సమావేశంలోనే రూ.5,116 చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసిన పత్రాలు అందించారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రమేశ్ చేస్తున్న సేవలను గుర్తించిన కేంద్రం ఇటీవల జాతీయ స్థాయిలో చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డును ప్రకటించింది.

పదేళ్లలో ఇలా..

రావుల రమేశ్ నుస్తులాపూర్‌కు రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పని చేశారు. ఆయన పదవీకాలంలో 190 మంది గర్భిణులకు సీమంతం చేయించారు. గడిచిన మూడేళ్లలో 38 మంది ఆడపిల్లలకు రమేశన్న కానుక అందించారు. 128 మందికి ఉచితంగా దహన సంస్కారాలు చేయించారు. ఇప్పటివరకు గ్రామంలో రూ.7కోట్లతో అభివద్ధి పనులు చేశారు.

నిరంతరం రమేశన్న కానుక పథకం

సర్పంచుల పదవీకాలం కొన్ని రోజుల్లో ముగియనుంది. తర్వాత ప్రత్యేక అధికారులు పంచాయతీల పాలన స్వీకరించనున్నారు. సర్పంచ్ పదవీకాలం పూర్తయినా కూడా రమేశన్న కానుక పథకం కొనసాగుతుందని ప్రకటించారు. తన తండ్రి రావుల రామచంద్రం కోరిక మేరకు ఆడపిల్లలు పుట్టాలి, ఎదగాలి అన్న లక్ష్యంతోనే ఈ పథకం ప్రారంభించానని తెలిపారు. ప్రజలందరి సహకారంతో దీనిని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే గ్రామంలో పేద కుటుంబానికి చెందిన ఎవరు చనిపోయిన దహన సంస్కారాలు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామస్తుల సహకారంతో..



తాను ఏ కార్యక్రమం చేపట్టిన దానికి పూర్తిస్థాయిలో గ్రామస్తులు, వార్డు సభ్యులు సహకరిస్తున్నారు. శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో తన సొంత ఖర్చులతో 21 మంది గర్భిణులకు సీమంతం, 11 మందికి రమేశ్ అన్న కానుక అందించాం. మహిళలందరికీ చీరతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి దుస్తులను అందించాం. బతికున్నంత వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తా.

- రావుల రమేశ్, సర్పంచ్, నుస్తులాపూర్

అభివృద్ధి పనులకు ఆమోదం


మాట్లాడుతున్న రాధిక

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో త్వరలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక చెప్పారు. శనివారం హుజూరాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 38 అంశాలను ప్రస్తావించగా, 37 అంశాలకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. వీటిలో పారిశుధ్య నిర్వహణకు వినియోగించే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీల రిపేరు, నూతన టైర్లను కొనుగోలు చేయడం, 15వ ఆర్థిక సంఘం నిధులతో మిషన్ భగీరథ పైపులైన్ల కోసం 30 వార్డుల్లో తవ్విన సీసీ రోడ్ల మరమ్మతు, మిషన్ భగీరథ నల్లాలకు ఆన్ ఆఫ్ వాల్వుల ఏర్పాటు, నీటి సరఫరా నిర్వహణకు ఖర్చు, హరితహారం కార్యక్రమంలో భాగంగా చెట్ల పొదలను తొలగించి ఎత్తుపల్లాల చదునుకు జేసీబీని ఆరు నెలల పాటు కిరాయికి తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కార్యాలయ మేనేజర్ రాంమోహన్‌రాయ్, ఇన్‌చార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి.సాంబరాజు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే


బ్యాటింగ్ చేస్తున్న కవ్వంపల్లి

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలో తెలంగాణ షార్ట్ ఫిలిం మేకింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో షార్ట్ ఫిలిమ్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఐలి రమేశ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కలర్ సత్తన్న, రమేశ్, జిల్లా అధ్యక్షుడు చొప్పరి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతామాలక్ష్మి, కనకవేణి శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, అనిత రాజ్, బోనాచారి, గవ్వ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, యువత అధ్యక్షుడు చెన్నబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మానకొండూర్: పదోతరగతి విద్యార్థులు ఈ ఏడాదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి మధుసుదనాచారి కోరారు. మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి మంచి మార్కులు సాధించేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక

చొప్పదండి: కొలిమికుంట సర్పంచ్ తాళ్ళపల్లి సుజాత భర్త, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లోని నివాసంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఎల్లంపల్లి నీరు విడుదల చేయాలి

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి ప్రాజక్టు నుంచి వెంటనే నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటపొలాలకు నీరందించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ర్యాలపల్లి గ్రామ శివారులో సాగునీటి సమస్యతో ఎండుతున్న పంటలను శనివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి సాగు నీరు వస్తుందని రైతులు నార్లు పోసి వరి పంటలు సాగు చేశారని, ప్రస్తుతం నీరు లేక నారుమడులతో పాటు సాగు చేసిన పంటపొలాలు ఎండిపోతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో గుంట భూమి కూడా ఎండిపోకుండా సాగు నీరందించామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు అందించే రైతుబంధు బందయిందని, సాగునీటి సమస్యతో పాటు కరెంటు సమస్య మొదలయిందన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం



హుజూరాబాద్‌రూరల్: తుమ్మన్నపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య సిబ్బందిని సర్పంచ్ గూడురి ప్రతాపరెడ్డి సన్మానించారు. ఐదేళ్ల సర్పంచ్ పాలనలో వైద్య సిబ్బంది మెరుగైన సేవలందించినందుకు గాను సత్కరించారు. వారిలో డాక్టర్ పంజాల స్నిగ్ధ, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎస్.రమేశ్, ఏఎన్‌ఎం సి.వజ్ర, మోరే కవిత, ఆశ వర్కర్లు బండారి పద్మ, గొడిశాల మంజుల, మిడిదొడ్డి స్వరూప, గ్రామ కార్యదర్శి ఉన్నారు. ఉప సర్పంచ్ బేతి రాజిరెడ్డి, కార్యదర్శి సింగిరెడ్డి సుష్మ, వార్డు సభ్యులు గాజుల కుమారస్వామి, గొడిశాల కనకలక్ష్మి, శ్యామ సుమ, బోడ పుష్ప, బొక్కల వసంత, గొడిశాల శ్రావణి, పెండాల మొండయ్య, గొడిశాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి


మాట్లాడుతున్న సీడీపీవో

గంగాధర: బాలికలను బాలురతో సమానంగా చదివిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి సూచించారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. పిల్లలను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలని, బడికి బంజేసి పనులకు పంపించొద్దని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని, బాల్య వివాహాలు చేయొద్దన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జమ్మికుంట: విద్యార్థులకు నాణ్యమైన మంచి భోజనం అందించాలని జమ్మికుంట జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. శనివారం పట్టణంలో కస్తూర్బా పాఠశాలను ఎంఈవో విడుపు శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో పరిశుభ్రత, బోధన విషయాలపై విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతగానో ఖర్చు చేస్తోందని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సూచించారు. క్లస్టర్ అధికారి సురేశ్, తిరుపతి, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందాకు పాల్పడిన వ్యక్తుల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్: రేషన్ బియ్యం అక్రమ దందాకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం కేసు వివరాలను వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో గల మహాలక్ష్మీ రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన శీలం శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని సీఐ రమేశ్ విచారణ చేయగా.. బియ్యం దందాకు సహకరించిన వ్యక్తుల వివరాలను చెప్పినట్లు తెలిపారు. బోర్నపల్లికి చెందిన కొమురయ్య, మెట్‌పల్లికి చెందిన అంగడి రమేశ్, ఇల్లందకుంటకు చెందిన తిరుపతిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. బియ్యం దందాకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులతో పాటు కీలక వ్యక్తి శీలం శ్రీనివాస్‌ను జైలుకు తరలించినట్లు తెలిపారు.

శివలింగంపై నాగుపాము



హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శివలింగంపై నాగుపాము హల్‌చల్ చేసింది. శనివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఓ నాగుపాము ఆలయంలో ఉన్న శివలింగంపై చేరుకొని పడగ విప్పింది. అప్పటి వరకు గుడిలో ఉన్న భక్తులు శివలింగాన్ని చుట్టుకొని ఉన్న నాగుపామును చూసి భయాందోళనకు గురయ్యారు. తర్వాత పూజలు చేశారు. అనంతరం నాగుపాము బయటకు వెళ్లిపోయింది.

చదువుతోనే భవిష్యత్తు

జమ్మికుంట: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కాకతీయ విద్యాసంస్థల అధినేత అవిర్నేని సుధాకర్‌రావు అన్నారు. పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం శనివారం ఘనంగా నిర్వహించారు. చదువుతోనే మంచి అవకాశాలున్నాయని అన్నారు. గత సంవత్సరం అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ రవిబాబు, శ్రీనివాస్‌రావు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి ప్రాధాన్యం


సాంబయ్యపల్లెలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కవ్వంపల్లి

గన్నేరువరం: గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. చొక్కారావుపల్లెలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, సీసీ రోడ్డు పనులు, సాంబయ్యపల్లెలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, గునుకులకొండాపూర్‌లో రజక భవనంతో పాటు ఆరె సంఘం భవనాలకు శంకుస్థాపనలు చేశారు. మైలారంలో మహిళా సమాఖ్య భవనం, గన్నేరువరంలో మండల విద్యావనరుల కేంద్రం, మధ్యాహ్న భోజన గది, సైన్స్ ల్యాబ్ గది, గుండ్లపల్లిలో రూ.30లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. అన్ని రంగాల్లో గ్రామాలను అభివృద్ధిలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గత పాలనలో మండలంలో అరాచకాలు, కబ్జాలు చేసి పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, త్వరలో అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో స్వాతి, ఏవో కిరణ్మయి, వైస్ ఎంపీపీ స్వప్న, సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, లక్ష్మీ, నర్సింహారెడ్డి, రేణుక, జ్యోతి, సమత, సహకార సంఘం మాజీ చైర్మన్ కోటి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, డీసీసీ కార్యదర్శి సునీల్, ఉప సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జీపీలను ప్రారంభించనున్న మంత్రి


మంత్రి ప్రారంభించనున్న గాగిరెడ్డిపల్లి పంచాయతీ భవనం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి తెలిపారు. శనివారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. ఉదయం 7.30 గంటలకు రేకొండలో దిహాలిక్ శ్రమజీవి, కోఆపరేటివ్ సొసైటీ గోదాంను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. 8.30 గంటలకు సీతారాంపూర్లో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారని, 9.30 గంటలకు సీతారాంపూర్, పీచుపల్లి, ద్వారా పర్లపెల్లి వెళ్లేందుకు పంచాయతీ రాజ్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. 10 గంటలకు చిన్నముల్కనూర్‌లో యాదవ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేయడంతో పాటు రామంచ–ముదిమానిక్యం గ్రామాల మధ్య పంచాయతీరాజ్ శాఖ రోడ్డుకు పునాదిరాయి వేస్తారని అన్నారు. 11.15 గంటలకు గునుకులపల్లె నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తారని, మధ్యాహ్నం 12.15 గంటలకు ఇందుర్తి–ఓగులాపూర్ వరకు పంచాయతీరాజ్ శాఖ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని, 12.30 గంటలకు ఇందుర్తిలోని పల్లె దవాఖాన నూతన భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. 1.30 గంటలకు గాగిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తారని వివరించారు.

బీఆర్‌ఎస్ వాళ్లే అవిశ్వాసం పెట్టారు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టింది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లేనని, కాంగ్రెస్ పార్టీ సహకారం కోరారని టీపీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, చైర్మన్‌పై వ్యతిరేకతతో కౌన్సిలర్ల తిరుగుబాటు చోటుచేసుకుందని, గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన సంస్కృతి బీఆర్‌ఎస్‌దే కానీ కాంగ్రెస్ కాదన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలకు ఏమి చెప్పి గెలిచారో మరిచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని అన్నారు.

'దేవంపల్లి'లో వీగిన అవిశ్వాస తీర్మానం

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి సహకార సంఘం అధ్యక్షురాలు కసిరెడ్డి లతపై సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు తెలిపారు. అధ్యక్షురాలపై గతేడాది డిసెంబర్ 30న సభ్యులు అవిశ్వాసం ప్రకటిస్తూ, తీర్మాన లేఖను జిల్లా అధికారులకు అందజేశారు. ఈ మేరకు శనివారం గ్రామంలోని సహకార సంఘం భవనంలో సమావేశం ఏర్పా టు చేయగా, సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని, ఇకపై ఆమెనే అధ్యక్షురాలిగా కొనసాగుతారని పేర్కొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి

జమ్మికుంట: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి రిజెక్ట్ బీజేపీ, రిజెక్ట్ ఎన్‌ఈపీ, సేవ్ ఇండియా, సేవ్ ఎడ్యూకేషన్ అనే డిమాండ్లతో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా కేంద్రం నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చిందని ఆరోపించారు. విద్యా కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని, దేశంలో జాతీయ విద్యావిధానం వల్ల 90శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కనుకం సాగర్, జిల్లా సహాయ కార్యదర్శి రాము, జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, నాయకులు దనోజ్, వంశీ, అరుణ్, సునీల్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



గన్నేరువరం: గునుకులకొండాపూర్ మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు సొల్లు అజయ్‌వర్మ తండ్రి సొల్లు రాజావీరు కాలు విరగగా.. కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌కుమార్, పుల్లెల నందన్‌కుమార్ ఉన్నారు.

రామడుగు హైస్కూల్‌లో నో బ్యాగ్ డే



రామడుగు: రామడుగు హైస్కూల్ విద్యార్థులు శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ నాలుగో శనివారం నో బ్యాగ్ డే నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. నో బ్యాగ్ డే సందర్భంగా రామడుగులోని చారిత్రక కోట సందర్శించారు. గ్రామ పెద్దలతో మాట్లాడి రామడుగు కోట విశిష్టత తెలుసుకున్నారు. వారితో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఉన్నారు.

సదస్సును జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

హుజూరాబాద్: పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన కోసం ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్లో జరిగే జిల్లా సాధన సదస్సుకు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ఈ సదస్సును జయప్రదం చేయాలని పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ బీమోజు సదానందం కోరారు. నియోజకవర్గ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, వ్యాపార వర్గాలు, మేధావులు, పూలే, అంబేడ్కర్ వాదులు, కవులు, కళాకారులు, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సైదాపూర్ మాజీ ఎంపీపీ పోడిసెట్టి వెంకట్రాజం, ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పంతం లింగారెడ్డి, వేల్పుల రత్నం, ఆలేటి రవీందర్, విష్ణుదాస్ గోపాల్‌రావు, డాక్టర్ తడికమళ్ళ శేఖర్, పులి జగన్నాథం, కంకణాల జనార్దన్‌రెడ్డి, గంజి జయవర్ధన్, క్యాస రమేశ్, వేల్పుల ప్రభాకర్, శివరతన్‌సింగ్, నమిండ్ల రవీందర్, కాసు ఐలయ్య, గోపగాని లింగయ్య, కుమారస్వామి, బుర్ర కుమార్‌గౌడ్, సిరికొండ సమ్మయ్య, ఆకునూరి అచ్యుత్, కొమురయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

'మంత్రిపై విమర్శలు మానుకోవాలి'


మాట్లాడుతున్న రవీందర్

సైదాపూర్: మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మతి భ్రమించి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శలు చేస్తున్నారని, అవగాహన రహిత విమర్శలు మానుకోవాలని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేలా పని చేసిన వ్యక్తికి మంత్రి జిల్లాకు ఉంటాడా, రాష్ట్రానికా తెలవకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. పొన్నం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా చేస్తే మాజీ ఎమ్మెల్యేకు వచ్చే ఇబ్బందేందని ప్రశ్నించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా పని చేసిన సతీశ్‌కుమార్ అవగాహన రాహిత్యంతో మాట్లాడితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ అన్నారు. సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, రాఘవులు, కిష్టయ్య, డీసీసీ కిసన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొత్త మల్లారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు దస్తగిరి, ఎంపీటీసీలు అరుణమల్లయ్య, చాంద్ పాషా, మాజీ ఎంపీటీసీ రమేశ్, బొమ్మగాని రాజు, అనగోని శ్రీనివాస్, యాదగిరి, రాజు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్ సందర్శన

మానకొండూర్‌రూరల్: శ్రీనివాస్‌నగర్ గ్రామాన్ని శనివారం కరీంనగర్ మలేరియా వైద్య బృందం సందర్శించింది. గ్రామానికి చెందిన అమ్మిగల్ల సరిత డెంగీతో మృతిచెందడంతో గ్రామంలో డ్రై డే నిర్వహించారు. ప్రతి వీధి వెంట తిరుగుతూ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంటిని పరిశీలించి డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా డాక్టర్ కె.మహేందర్‌రెడ్డి, సెక్రటరీ మధుమిత, సీహెచ్‌వో రాజునాయక్, ఏఎన్‌ఎం సరోజ పాల్గొన్నారు.